# జీవితపు జమాఖర్చులు

విజ్ఞానం అంటే యేమిటో పుస్తకాలన్నీ తిరగేసి చూస్తున్నాడు శంకరం.

“అజ్ఞానం, విజ్ఞానం” అనే విషయంమీద ఉపన్యాసమివ్వాలి. ఏ పుస్తకం తెరిచినా యేదో క్రొత్త విషయం అయినట్టు కనిపిస్తూనే వుంది. కొన్ని పుస్తకాల్లో విషయసూచికలు మాత్రం చూసి వదిలేస్తున్నాడు. కొన్ని పుస్తకాల్ని సామూలాగ్రంగా చదవాలని విడిగా పెట్టాడు. కొన్ని పుస్తకాల్లో యేవో గుర్తులు పెట్టుకుంటున్నాడు. ఎక్కడా అంతు కనిపించటం లేదు. అదివరకు అనేక విషయాలమీద అనేక ఉపన్యాసాలు యిచ్చాడు కాని, యీ విషయంమీద మాత్రం వుపన్యాసం యివ్వటానికి జంకుగానే వుంది. కొంచెంసేపు పుస్తకాలన్నింటినీ ముందర టేబుల్ మీద పెట్టేసుకుని, ఏదో ఆలోచిస్తున్నట్లు వెనక్కు ఒత్తిగిలాడు. మెల్లిగా కలం కూడా ముడిచేసి టేబుల్ మీద పెట్టి, ఫ్లాస్కులో కాఫీని ప్రక్కనున్న గుండ్రపు వెండిగ్లాసులో పోసుకున్నాడు. కొంచెంకొంచెంగా కాఫీ తాగుతున్నాడు. కాఫీ బాగా వేడిగానే వుంది. ఆ గ్లాసును రెండు చేతుల్లోను అటుయిటు మారుస్తున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తూ, గుటకలు వేస్తున్నాడు. గభాలున తన కళ్ళను చూసిన ఎదురు గోడమీద ఫోటోలవైపు దృష్టి పోనిచ్చాడు.

అతని హృదయంలో ఓ విధమైన ఆవేదన బయలుదేరినట్లు వళ్ళంతా చెమటలుపోసినాయి. మొహమంతా ఉత్తరీయంతో తుడుచుకుంటూ, రేగిపోయిన జుట్టును వెనక్కు నెట్టేసుకున్నాడు. రెండుచేతులూ దవడల్క్రింద పెట్టేసి, మోచేతుల్ని బల్లమీద నిటారుగా ఆనిచ్చి, మళ్ళీ ఆ ఫోటోవంక చూశాడు. విసురున అప్పుడప్పుడు వస్తున్న గాలికెరటాలు, ఆ ఫోటోను గోడకేసి కొడుతున్నాయి. ఆ గాలిలోని తేమ తన గుండెల్లోకిపోయి చల్లపరుస్తోంది. వరసగా ఫోటోలన్నీ కనిపించినాయి. ఒక్కొక్క ఫోటో రెండు రెండుగా కనిపిస్తోంది. ఆ గోడ కదిలిపోతున్నట్లు కనిపించింది. చప్పున జేబు రుమాలుతో రెండుకళ్ళు తుడుచుకున్నాడు. తన బుర్రలో గిర్రున ఆలోచనలన్నీ తిరిగిపోతున్నాయి. తన గత చరిత్రంతా, యించుమించుగా ఆఫోటోల్లో

కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఎప్పటికప్పుడు మనస్సు తనకు తెలీకండా బాధ పడుతూనే వుంది. ఆ ఫొటోవంకే అట్టే కన్నార్పకండా చూస్తున్నాడు. పార్వతి యేదో ప్రార్థేయపడుతున్నట్లు కనిపించింది.

* *

"ఏమండీ...మిమ్మల్నే..." పార్వతి హోరుమని యేడ్చింది పైకి చెప్పటానికి యిష్టంలేక.

"డాక్టరు యీసారి జాగ్రత్తగా వుండాలి అన్నది. నాకేమిటో భయమేస్తోంది. నేను చెప్పలేను. నాపిల్లలు, నా దగ్గరకు రండి..." అమాంతం పిల్లలమీదపడి తనివితీరా ముద్దాడుతోంది పార్వతి.

"ఎందుకూ యింత భయం. నీదసలే పిరికి గుండె. నేనున్నాగా, ఏదో చేస్తానులే!" శంకరం అన్నాడు.

"అసలే నా మనస్సు కలతపడి వుంది. మీరు అనవసరంగా నన్ను తిట్టి యింకా బాధపెట్టకండి. మీకో నమస్కారం"! పార్వతి కంఠం తడబడింది.

శంకరం విసుగ్గా ఉత్తరీయాన్ని రెండు బుజాలమీదా వేసేసుకుని వాకిట్లోకి వెళ్ళిపోయాడు.

"ఇంత జాలీ నాలీ లేని మగవాణ్ని యెక్కడా చూడలేను. తనసుఖమే సుఖము. తక్కినవాళ్లు ఎట్లా పోయినాసరే!" అసూయపడిపోతోంది పార్వతి.

"అన్నం అయిందా?" వాకిట్లోంచి వస్తూనే శంకరం అధారిటీగా అన్నాడు.

'ఇంకా పొయ్యిదగ్గరకు పోలేదండీ!' ఎంతో నీరసంగా లేస్తూ అన్నది పార్వతి.

'బైట పల్లకీల మోత. యింట్లో యీగలమోత. బైటకుపోతే నెత్తిన పెట్టుకుంటారు, ఇంటికి వస్తే ఒకటే యేడుపు.' విదిలించుకుంటూ శంకరం చివాలున వెళ్ళిపోయాడు.

"ఈ పిల్లలతో చచ్చి సతమత మవుతుంటే, అయ్యో అన్న పాపాన పోలేదు. తమరి సుఖం చూస్తుంటే సరి, యితరవాళ్ళు చచ్చినాసరే...' పార్వతి ఆక్రోషం పట్టలేక అంటోంది.

* *

"ఏం డాక్టరుగారూ, ఏమంటారు?" శంకరం వణుక్కుంటూ అన్నాడు.

"నేను మీకు మొదటే చెప్పాను. ఇది ఏడో కాన్పన్నారు. చాలా బలహీనంగా వుంది. ఇప్పుడేం చెప్పలేను. మేం చెయ్యగలిగినదాంట్లో ఏ లోపమూ వుండదు" గది తలుపు వేసేశారు.

కెవ్వుమంటూ కేక వినిపించింది.

శంకరం అదిరిపోయాడు.

నర్సులు బిక్క మొహం వేసుకుని మెదలకుండా వెళ్ళిపోయారు.

* *

శంకరం కళ్ళనిండా గిర్రున నీళ్ళు తిరిగినాయి. పెదవులు తడబడుతూ పార్వతీ, పారూ, అని మెల్లిగా లోపలలోపల అనుకుంటున్నాడు. ఆ ఉద్వేగాన్ని అణుచుకోలేకపోతున్నాడు. తన గుండె బద్దలయిపోతోంది. కళ్ళు గంభీరంగా ఆ పార్వతి వైపే చూస్తున్నాయి. శరీరం అంతా వణికిపోతోంది. రెండుచేతులతో మొహమంతా కప్పేసుకుని ముందు టేబుల్ మీదకు ఒరిగాడు. తన మనసు అంతా ముక్కలు ముక్కలయి పోతోంది. తన జీవితంలో పశ్చాత్తాపానికి కూడా అవకాశం లేకపోయింది. ఇతరులకు ఆచరణ యోగ్యం అయినది తన జీవితంలో అమలుపరుచుకోలేకపోయాడు. తనకు మిగిలిందల్లా తన దుఃఖము, అంతులేని ఆవేదన, అర్థంలేని ఆవేశం. పట్టు బిగువున, గుండె చిక్కబెట్టుకుని మెల్లిగా తలెత్తాడు. మృత్యువు వికటాట్టహాసం చేస్తున్నట్లు కనిపించింది. . వెంటనే తన దృష్టిని ఆ ఫోటోనుంచి మరల్చాడు.

"వీరు శంకరంగారు. ప్రఖ్యాత ఉపన్యాసకులు. ఈనాడు, కుటుంబాన్ని పరిమితంచెయ్యటంయొక్క ఆవశ్యకతను గురించి వుపన్యసిస్తారు" ఒక్కక్షణంలో, తనముందు గుమికూడిన జనం అంతా కనిపించారు.

హర్షధ్వానాలు, కోలాహలం, తన చెవుల్లో గింగురుమన్నాయి. అలాగే ఆ అనుభూతిని ఆనందిస్తూ, కొద్ది క్షణాలు పరవశుడయిపోయాడు శంకరం. తనకు ఉపన్యాసాలంటే యెంతో సరదా. తనకున్న ప్రవీణతను యితరులు శ్లాఘిస్తూ వుంటే, తన కీర్తి నలుదిశలా ప్రాకిపోతూ వుంటే, శంకరం ఆనందం పట్టలేడు.

తాను అసలు వుపన్యాసాలు యిస్తానని కాని, తనకు ఆ విధమైన శక్తి సామర్థ్యాలు వున్నాయని కాని, తాను యెన్నడూ అనుకోలేదు. తాను ఓ సామాన్యమైన వ్యక్తి. తండ్రి, రెండు ఎకరాలు అమ్మి ఇల్లు కడితే, తాను యిల్లు అమ్మి డిగ్రీ కొనుక్కున్నాడు. తాను చూస్తుండగానే పొలంధర, యిల్లుధర పెరిగిపోయింది. కాని తన డిగ్రీవలన తనకే ప్రయోజనం లేకుండా పోయింది. తీవ్రంగా ఆలోచించాడు. దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు. భూమంతా అనంతంగా కనిపించింది. జనం అమాయకులుగా కనిపించారు. గాలి వాలుగా వుంది. నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది. తన జీవితంలో పురోగమనానికి నిరుద్యోగ సమస్య ఒక మెట్టు. ఒళ్లు తెలీకుండా వుపన్యాసాలు యిచ్చేశాడు. వచ్చిన వారు కొద్దిమందైనా అందరూ చదువుకున్నవాళ్ళే. వాళ్ళ ఆదుర్దాని, వాళ్ళ అసమర్థతను, తన స్వప్రయోజనాలకు ఉపయోగించుకోటానికి శంకరానికి మంచి అవకాశం వచ్చింది. పురపాలక సంఘానికి అధ్యక్షుడయినప్పుడు పూలహారం వేస్తుండగా ఫోటో తీశారు. ఆ ఫోటో కాస్త గాలి విసురుకు రింగుతప్పి తన కాళ్ళముందర పడింది. మెల్లిగా ఫోటో తీసి, పైబట్టతో బూజంతా తుడిచేసి, కుర్చీప్రక్కనే పెట్టేశాడు. మళ్ళీ తన ఆలోచనలన్నీ వెనక్కుపోతున్నాయి. గాలి గట్టిగా వీస్తోంది. కిటికీ తలుపులు డబడబా కొట్టుకుంటున్నాయి. గోడ మీద ఫోటోల్లో తన గత జీవితచరిత్రంతా కళ్ళముందర నాట్యమాడుతోంది. తనకు పెద్దవయస్సులో కుడిభుజంలాగ కొడుకుంటే యెంతబాగుంటుందనుకున్నాడు. ఆ ఫోటోలో తన కొడుకు ప్రాణాలతో నిలబడ్డట్లు కనిపిస్తున్నాడు. మధూ నువ్వు నాదగ్గరుంటే నా ప్రాణం ఎంత హాయిగా వుంటుంది చెప్పు!" శంకరం అట్లాగే చూస్తూనే పెద్ద నిట్టూర్పు విడిచాడు. తన మధును చూసేటప్పుడికి, మధు జీవితమంతా ఒక్కసారిగా కళ్ళకు కట్టినట్లు కనిపించింది.

"నాన్నా నేను వసంతను పెళ్ళిచేసుకుంటాను. ఈ విషయంలో మాత్రం, నా మనస్సు బాధ పెట్టేటట్లు జోక్యం కలుగచేసుకోవద్దు...నన్ను క్షమించు...నువ్వేది చెప్పినా వింటాను...కాని యీ విషయంలో..." మధు దీనత్వం కొట్టచ్చినట్లు కనిపించింది.

"నేను కష్టపడి, చెమటోడ్చి సంపాదించాను. ఆ సంపాదనలోనే, నేను కడుపు మాడ్చుకుని నీకు చదువు చెప్పించాను. నీ చదువు, నా జీవితానికి ఉపయోగపడుతుందని యెంతో ఆశ పెట్టుకున్నాను. నా వ్యక్తిత్వాన్ని చంపుకుని, నిన్ను వ్యక్తిగా చేశాను. నీ వ్యక్తిత్వం కోసం నన్ను బలిచెయ్యకు. నేను పెద్దవాణ్ణయిపోతున్నాను...నామాట విను...రామనాథంగారి అమ్మా యిని చేసుకో...ఆస్తంతా వస్తుంది...నా గుండెమీద బరువు తీసినవాడివి అవుతావు..." శంకరం ఎంతో బింకంగా అన్నాడు.

తనకు ఏది ప్రియమైనదనుకున్నాడో, ఆ కొడుకే తనకు కాకుండా పోయాడు. రామనాథంగార్ని కసితీరా తిట్టేస్తున్నాడు. అక్కడ మనిషి కనక వుంటే ఏ పనైనా చెయ్యటానికి సిద్ధపడేవాడులాగ కనిపించాడు శంక రం. కొంచెం తమాయించుకుని, మళ్ళీ వర్తమానంలోకి వచ్చేశాడు.

"శంకరంగారు మన నియోజకవర్గమనుంచి శాసనసభకు యెన్నిక అయి నందుకు మీ అందరి తరఫున నేనాయనకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. వీరు వరకట్నం నిషేధంగురించి శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లు చిరస్మరణీయమైనది. సామాజిక స్థితిని అవగాహనం చేసుకుని, సమాజ పురోభివృద్ధికి వీరు చేస్తున్నకృషి ఎంతైనా ప్రశంసనీయమైంది."

సభలో హర్షధ్వనాలు మిన్నుముట్టినాయి. శంకరం మనస్సు కొంత శాంతించింది. ఆ మీటింగునే జ్ఞాపకం తెచ్చుకుంటూ ఆనందం పొందు తున్నాడు శంకరం. తన మనస్సు పరిపరివిధాల ఆలోచిస్తోంది. తాను జీవి తంలో యే ఆశయం పెట్టుకున్నాడు? ఏ లక్ష్యాన్ని సాధించాడు? దేనికోసం త్యాగం చేశాడు? ఇతరులను దేనికోసం త్యాగం చెయ్యమన్నాడు? సమా జంలో తనకు స్థానం యేమిటి? సంఘ పురోభివృద్ధికి తాను చేసిందేమిటి?

ఏమిటో ఆలోచనలు పోతున్నాయి. అస్పష్టంగా తన మనస్సులోకి ఏవో సమాధానాలు దూరుతున్నాయి. ఎంతో చిరాకు పడిపోతున్నాడు. మనస్సంతా గజిబిజిగా వుంది. చాలా కంగారుగాను, చాలా ఆందోళనగానూ వుంది. తన ఒళ్ళంతా వేడిగా వున్నట్లనిపించింది. ఒళ్ళంతా విరగదీసేస్తున్నట్లుంది. ఏమిటో పిచ్చిగా కొన్ని ఆలోచనలు తన మెదడులోకి దూరి, భావవిప్లవం బయలుదేరింది. రైళ్లు తన మెదడుకులోకి పరుగెత్తినాయి. ఆవేశం, బాణం లాగ తన గుండెలోంచి దూసుకుపోతోంది. రెండు మూడు ఫోటోలు ఊగిసలాడుతూ తనను వెక్కిరిస్తున్నట్లు వెకిలిగా కనిపించినాయి. తన మెదడంతా దండలమయమయి, గుండె బరువెక్కినట్లు ఆయాసపడిపోతున్నాడు. తనను నమ్మి పల్లెటూళ్ళల్లోనే కాలం గడిపి, తనువు చాలించిన తన ముఖ్య స్నేహితుడు వేణు తన రెండు కళ్ళముందూ నిలువుగా నిలబడి యితర ప్రపంచాన్ని చూడనీయలేదు. శంకరం కంపించిపోయాడు. తాను అధికారంలో ఉన్నప్పుడు తానుచేసిన పనులన్నీ ఒక్కొక్కటే జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు. తాను ఆ పదవికి రావటానికి కారకులయిన వాళ్ళందరూ గిర్రున కళ్ళల్లో తిరిగి వెళ్ళిపోయారు. తాను గిర్రున తిరిగిపోతున్నాడు. భూమి గుండ్రమే అనిపించింది. ప్రజలు అమాయకులు కారని గట్టి నమ్మకం యేర్పడింది. తనకు యీనాడు యీస్థితి రావటానికి కారణం యేమిటో పూర్తిగా అర్థమయినట్లనిపించిది. రెండు కన్నీటి బిందువులు టేబుల్ మీద కాగితాలమీద పడ్డాయి. చప్పున ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకుని, కాగితాల వంక చూశాడు. "నేను యింక ఉపన్యాసాలు యివ్వను" అని గట్టిగా హృదయంలోకి అరిచాడు. "నేను ప్రజలదగ్గరకువెళ్ళి యేం చెప్పగలను? నేర్చుకుంది ఆచరించలేక పోయాను. ఎందుకు యీ వ్యర్థమైన వుపన్యాసాలు?" అని ఆవేశంగా లేచి తన యెదుట వున్న కాగితాలన్నింటినీ చించి పోగులు పెట్టేశాడు. అప్పుడు గుండె యెంతో తేలిక బడ్డట్లయింది.